నేడు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నంది గామ మైత్రి ప్రియ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని పలు సంస్థలు, కార్యాలయాల్లోని 150 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, బీఈడీ విద్యార్హతతో పాటు 18 ఏళ్లు పైబడినవారు అర్హులు. ఎంపికైన వారికి వారి విద్యార్హత, నైపుణ్యం ఆధారంగా ఆకర్షణీయమైన జీతభత్యాలు ఉంటాయన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు గురువారం ఉదయం 10 గంటలకు ఫోటోలు, సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 83284 28933.

'బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి '


ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: బీఆర్‌ఎస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. పదేళ్లుగా దేశంలో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని నెంబర్ 1 గా తీర్చిదిద్దిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. బుధవారం గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు పప్పు మాత్రే ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గోషామహల్‌తో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని ఐటీ, పర్యాటకరంగంతో పాటు ఇతర రంగాల్లో తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించి బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అక్రమ పార్కింగ్‌లపై కొరడా !


షేక్‌పేట్ డీమార్ట్ వద్ద పార్క్ చేసిన వాహనాలను తరలిస్తున్న దృశ్యం

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. గత రెండ్రోజులుగా టోలిచౌకీ ట్రాఫిక్ పోలీసులు అక్రమ పార్కింగ్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టోలిచౌకీ చౌరస్తా, షేక్‌పేట్ డీమార్ట్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై అక్రమంగా పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని గోల్కొండలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేవలం ద్విచక్ర వాహనాలనే టార్గెట్ చేసుకుంటూ.. ట్రాఫిక్ పోలీసులు తమపై కక్షసాధిస్తున్నారని పలువురు ద్విచక్ర వాహనదారులు ఆరోపిస్తున్నారు. షేక్‌పేట్ నాలా, పాస్‌పోర్టు సేవా కేంద్రంతో పాటు టోలిచౌకీ చౌరస్తా, టోలిచౌకీ సాలర్‌జంగ్ కాలనీలోని రెస్టారెంట్లు, పశ్చిమ మండలం ఆర్టీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో రోడ్లపై అక్రమంగా పార్కు చేసిన కార్లను ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తి చూడటం లేదని వారు వాపోతున్నారు.

ఘనంగా ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే


సర్టిఫికెట్లతో ప్రీ ప్రైమరీ విద్యార్థులు

డబీర్‌పురా: మాస్టర్స్ గ్రూపు ఆఫ్ స్కూల్స్ ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థినీవిద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్‌లు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. డైరెక్టర్ ఈ. శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ మాధవి, ఈవెంట్ ఆర్గనైజర్ ఆయేషా పర్వీన్, సదాలక్ష్మి, సుకన్య, సుజాత్, ఆయేషా తదితరులున్నారు.

ధూమపాన అనర్థాలపై అవగాహన ర్యాలీ



చార్మినార్: ధూమపాన రహిత సమాజం కోసం స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎర్రగడ్డ ప్రభుత్వ చెస్ట్, జనరల్ ఆస్పత్రి శ్వాసకోశ నిపుణులు డాక్టర్ కార్తీక్ అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఫలక్‌నుమా డిగ్రీ కాలేజీలో అవగాహన కార్యక్రమం జరిగింది. ధూమపానంతో కలిగే అనర్థాలపై పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ వి.కార్తీక్ మాట్లాడుతూ.. ధూమపానంతో ఊపిరితిత్తుల కేన్సర్ వ్యాధులతో పాటు గుండె జబ్బులు వస్తాయన్నారు. ప్రముఖ ఆయుర్వేద నిపుణులు డాక్టర్ చంద్రమౌళీ, ప్రముఖ విద్యావేత్త మహమ్మద్ అక్తర్ షరీఫ్, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ్ ముదిరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసంతకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ శశికళ, గంగాధర్, పాతబస్తీ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్ఆర్‌కే శాస్త్రి, షేక్ షరీఫ్ అలీ, కాంగ్రెస్ నాయకులు కాశమోనీ శ్యామ్‌రావు తదితరులున్నారు.

మహిళా అభ్యున్నతితోనే సామాజిక ప్రగతి

గన్‌ఫౌండ్రీ: మహిళా అభ్యున్నతితోనే సమాజ, సామాజిక అభ్యున్నతి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో మెగా సిటీ నవకళావేదిక, మదర్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు మహిళలకు ఉమెన్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేశారు. అంతకు ముందు సినీ సంగీత విభావరి సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను ఆహూతులను ఆకట్టుకున్నాయి. సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, మిస్టర్ ఇండియా- 2019 డాక్టర్ శోభాదేవి, గాంధీ మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి, హైకోర్టు న్యాయవాది డీఎల్ పాండు, మదర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లికార్జున్‌రావు తదితరులున్నారు.

పాతబస్తీలో లస్సీకి పెరిగిన గిరాకీ..

- ఓవైపు రంజాన్ మాసం.. మరోవైపు మండే ఎండలు
- ఇఫ్తార్ విందులో లస్సీలకు ప్రాధాన్యం


లస్సీ తయారీ దుకాణం వద్ద వినియోగదారుల సందడి

చార్మినార్: ఓ వైపు రంజాన్ మాసం..మరో వైపు వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు చల్లని రుచికరమైన పానీయాలైన లస్సీ, ఫాలుదాలకు పాతబస్తీలో గిరాకీ పెరిగింది. రోజంతా కఠోర ఉపవాస దీక్షల అనంతరం సాయంత్రం నిర్వహించే ఇఫ్తార్ విందులో లస్సీ తాగేందుకు ఇష్టపడతారు. దీంతో పాతబస్తీలో అన్ని వర్గాల ప్రజలు ఎక్కువగా ఇష్టపడేది రుచికరమైన లస్సీ. వేసవిలో లస్సీ ఎంతో ఉపశమనం కల్గిస్తుంది. పాతబస్తీ నుంచే కాకుండా ఇతర ప్రాంతాల వినియోగదారులు కూడా ఇక్కడి శాలిబండకు వచ్చి తమకు ఇష్టమైన లస్సీని తాగుతారు. దీంతో ఇక్కడ ఏడాది పొడవునా గిరాకీ ఉంటుంది. కేవలం వేసవిలోనే కాకుండా అన్ని సీజన్లలో ఇక్కడ లస్సీ దొరుకుతుంది.

వడదెబ్బ తగిలిన వారికి 'ఫాలుదా'...

ఫాలుదా శరీరాన్ని చల్లబరచడమే కాకుండా వడదెబ్బకు గురైన వారికి వెంటనే ఉపశమనం కల్గిస్తుంది. లస్సీ తయారు చేసే విధంగానే ఫాలుదాను తయారు చేస్తారు. కాకపోతే అదనంగా సబ్జా గింజలు వేస్తారు. వీటివల్ల శరీరానికి చల్లదనం చేకూరుతుంది. దీంతో పొద్దంతా ఎండల్లో తిరిగే వారు ఇంటికి చేరిన అనంతరం ఒక గ్లాస్ ఫాలుదా తీసుకుని ఉపశమనం పొందుతారు. ఇళ్లల్లో చేసుకోలేని వారు లస్సీ దుకాణాలకు వెళ్లి తీసుకుంటారు. వేసవిలో చల్లదనంతో పాటు వడదెబ్బ తగులకుండా కాపాడుతుండటంతో పాతబస్తీలో ఫాలుదాకు గిరాకీ పెరిగింది.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


జూలూరి సత్యనారాయణ

చాంద్రాయణగుట్ట: రెడ్డి కులస్తులలోని పేదల అభివృద్ధి కోసం రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని పాతబస్తీ రాజన్నబావి రెడ్డి జనసంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం సంఘం వద్ద అసోసియేషన్ ప్రతినిధులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంఘం అధ్యక్షుడు నానవల్ రాంరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఎవరూ.. తీసుకోని సాహసోపేత నిర్ణయం తీసుకున్న సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సంఘం ప్రతినిధులు బొక్క రాంచంద్రారెడ్డి, ఆర్.అశోక్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్.ప్రమోద్‌రెడ్డి, ఎం.మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సత్యంరెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై..

అబిడ్స్: లక్షలాది మంది ఆర్యవైశ్యులు ఎదురుచూస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించడం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆర్యవైశ్యులంతా ఎదురుచూస్తున్న చిరకాల స్వప్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులను రాజకీయ, సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఆర్యవైశ్య మహాసభ నిరంతరం అండగా ఉంటుందన్నారు. చాలా ఏళ్లుగా ఆర్యవైశ్య మహాసభ డిమాండ్ చేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో లక్షలాది మంది ఆర్యవైశ్యుల తరఫునా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్రమంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



గోల్కొండ: తెలంగాణ ఏకలవ్య కార్పొరేషన్ ప్రకటించి సీఎం రేవంత్‌రెడ్డి ఎరుకల సోదరుల అభివృద్ధికి ఆయన చూపుతున్న చొరవను మరోసారి రుజువు చేసిందని రాష్ట్ర ఎరుకల సంఘం ప్రధాన కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించిన సందర్భంగా రాష్ట్ర ఎరుకల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఉన్న ఎరుకల సంఘం సభ్యులు కాంగ్రెస్‌కు ఓటు వేస్తామని తీర్మానం చేశారన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఎరుకల సంఘం సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసి వారి విజయానికి కృషి చేస్తారన్నారు. ఏకలవ్య సంఘం చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సత్యనారాయణ, రఘు, మల్లికార్జున్, ఆర్.నర్సింహ్మా, రమేష్, కృష్ణ, గాలేటి కార్తిక్, విష్ణు, శ్రీనివాస్ తదితరులున్నారు.


రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పోల్కం శ్రీనివాస్

మేరు కార్పొరేషన్ ఏర్పాటుపై..

అబిడ్స్: రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షులు పోల్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీభవన్ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎన్నో ఏళ్లుగా మేరు కులస్థులు ఎదురుచూస్తున్న మేరు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమన్నారు. మేరు కులస్థుల చిరకాల స్వప్నాన్ని నిజం చేసిన రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు మేరు కులస్థులమంతా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత జాబేర్ పటేల్ మృతి



గోల్కొండ: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ సంఘ సేవకుడు జాబేర్ పటేల్ (58) మృతి చెందారు. టోలిచౌకీ తూమ్స్‌రోడ్‌లో ఉండే ఆయనకు మంగళవారం రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో ఆయనను హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు సంతానం. కాగా జాబేర్ పటేల్ ఆల్ ఇండియా మైనార్టీ ఫోరం చైర్మన్, ఇండో అరబ్ ఫ్రెండ్‌షిప్ ఫౌండేషన్ చైర్మన్‌గా గత రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. సాబిర్ పటేల్ ఎంటర్‌ప్రైజెస్ అధ్యక్షుడిగా ఉంటూనే హిందూ, ముస్లింల ఐక్యత కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. మామిడి పండ్ల రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఆయన తన తండ్రి సాబిర్ పటేల్‌తో కలిసి ఎంతో కృషి చేశారు.

నిరుద్యోగుల దీక్ష భగ్నం

చైతన్యపురి: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో చైతన్యపురిలో నాలుగు రోజులుగా నిరుద్యోగులు చేస్తున్న దీక్షను చైతన్యపురి పోలీసులు భగ్నం చేశారు. జీఓ 46ను రద్దు చేయాలని, గ్రూప్ పోస్టులు పెంచాలని, టెట్ నిర్వహించాలని నిరుద్యోగలు కొందరు దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే.కాగా, దీక్ష చేస్తున్న అశోక్‌తో పాటు మరికొందరిని చికిత్స కోసం ఉస్మానియాకు తరలించామన్నారు.

అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటాం


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి వారి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు ఆయనను కలిసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లోని సమస్యలు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మూడోసారి ఎన్నుకున్న ప్రజలకు ఎప్పుడూ.. అందుబాటులో ఉంటున్నానన్నారు. వేసవిలో ప్రధానంగా తాగునీటి సరఫరాపైనే సమస్యలు వస్తున్నాయన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో నీటి సరఫరాపై ఇప్పటి వరకు ఎలాంటి కోతలు లేవని నీరు అందరికీ అందుతుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల పలు ప్రాంతాలకు లోప్రెజర్ నీరు వస్తుందన్న విషయం తన దృష్టికి వచ్చిందని వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో నీటి బూస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీన్ని వల్ల లోప్రెజర్ సమస్య పూర్తిగా తొలగిపోయిందని పేర్కొన్నారు. రంజాన్‌లో మసీదులకు జలమండలి ద్వారా తాగునీరు అందిస్తున్నామని, నీటి ట్యాంకర్ కోసం మసీదు నిర్వాహకులు జలమండలి వారికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

సమాజ నిర్మాణంలో మహిళలదే కీలకపాత్ర


ఉపాధ్యాయులతో సాయిబాబాచారి, శ్రీకాంత్‌చారి

గోల్కొండ: సమాజ నిర్మాణంలో మహిళలదే కీలకపాత్ర అని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సేవా సమితి అధ్యక్షులు బొమ్మల శ్రీకాంత్‌చారిఅన్నారు. బుధవారం గోల్కొండ ఉర్వా స్కూల్‌లో గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ వృత్తి పనివార్ల సంఘంతో కలిసి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల టీచర్లు, ఆయాలకు విద్యారంగంలో విశిష్ట సేవా పురస్కారాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నేడు అక్షరాస్యత శాతం పెరగడానికి మహిళలే కారణమని అన్నారు. విద్యాబోధన రంగంలో మహిళలు విశేషంగా రాణిస్తున్నారని విద్యార్థులను తీర్చిదిద్దడంలో వారిదే కీలకపాత్ర అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలోనే కాకుండా ఇతర రంగాల్లో సైతం పురుషులకు దీటుగా మహిళలు ముందుకు సాగుతున్నారన్నారు. సాయిబాబాచారి, ఉర్వా హైస్కూల్ అకడమిక్ హెడ్ సమీనాతన్వీర్ తదితరులున్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

గోల్కొండ: ఓ వైపు వక్ఫ్ బోర్డు ఈ స్థలం తమదని అంటుండగా ముమ్మాటికి తమదేనంటూ.. కొందరు వ్యక్తులు దబాయిస్తున్నారు. గతంలో రెవెన్యూశాఖ వారు సైతం ఈ స్థలం ప్రభుత్వ వక్ఫ్ బోర్డుదేనని సర్వేచేసి తేల్చారు. సర్వేలను కబ్జాదారులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. వక్ఫ్‌బోర్డు అధికారులు సదరు స్థలంపై వేసిన కంచె, గేటు దర్జాగా తొలగిస్తున్నారు. గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియానికి ఆనుకోని ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు చెందింది. దీనికి సంబంధించిన రికార్డులు అన్ని తమవద్దే ఉన్నాయని వక్ఫ్ బోర్డు అధికారులు చెబుతున్నారు. కాగా గతంలో పార్టీలకు అతీతంగా కొందరు గంపగుత్తగా ఈ స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముకున్నారు. గతంలో ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ ఈ స్థలాన్ని సర్వేచేసి ఇది ముమ్మాటికి ప్రభుత్వ స్థలమేనని దీనికి సర్వేచేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈ స్థలం ప్రభుత్వ స్థలమంటూ.. పెద్దగా అక్కడ బోర్డును కూడా ఏర్పాటు చేశారు. కబ్జాదారుల నుంచి భూములు కొన్న వారు సదరు కబ్జాదారుల అండతో బోర్డుతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రహరీని కూడా ధ్వంసం చేశారు. తాజాగా ఈ స్థలంపై స్థానిక బీజేపీనేత ఒకరు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చి ఆయనకు వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు కళ్లు తెరిచి గత రెండ్రోజుల క్రితం సదరు స్థలం వద్దకు వచ్చి గేటుకు తాళాలు వేసుకుని ఈ స్థలం తమదేనంటూ.. మరోసారి బోర్డు పెట్టారు. వారక్కడ ఉండగానే సదరు కబ్జాభూమి తమదేనంటూ.. చెబుతున్న వారు తాళం పగలగొట్టి సదరు స్థలంలోకి వెళ్లి బైటాయించారు. కబ్జాదారులపై పోలీసులు కేసులు పెట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

అబిడ్స్: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఎం.కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని జీఎం జాన్ షరీఫ్‌కు మెమోరాండం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో తొలిసారి నీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. అన్ని ప్రాంతాల్లో బోర్ వెల్స్ వేయించాలన్నారు. నీటి సరఫరా పుష్కలంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. నరేష్‌గౌడ్, వెంకటేష్, అహ్మద్ తదితరులున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

'పది'కి సర్వం సిద్ధం

- రంగారెడ్డి జిల్లాలో పరీక్షలు రాయనున్న 50,946 మంది విద్యార్థులు
- 239 కేంద్రాల్లో నిర్వహణ
- పోలీసుల నిఘాలో ప్రశ్నపత్రాలు



హుడాకాంప్లెక్స్: ఈ నెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 50,946 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో బాలురు 26,492, బాలికలు 24,454 మంది, ప్రైవేటుగా మరో 1012 మంది పరీక్షలు రాయనున్నారు. మొత్తంగా 239 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 239 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 237 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను, 41 మంది అడిషనల్ అధికారులను, 9 మంది ఫ్లయింగ్ స్క్వాడ్లు, 239 మంది సిట్టింగ్ స్క్వాడ్లు విధుల్లో ఉంటారు. సరూర్‌నగర్ మండల పరిధిలో కర్మన్‌ఘాట్ పాఠశాలలో 143, బహదూర్‌గూడలో 147, రాజీవ్‌గాంధీనగర్ 66, చంపాపేట 79, సరూర్‌నగర్ 212, మన్సూరాబాద్ 29, సరూర్‌నగర్ ఉర్దూ మాధ్యమ పాఠశాల నుంచి 17 మంది పరీక్షలు రాయనున్నారు. సరూర్‌నగర్ మండల పరిధిలో 44 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదో తరగతి ప్రశ్నా పత్రాలు ఈ నెల 12న కేంద్రాలకు అందుబాటులోని పోలీస్‌స్టేషన్లకు చేరాయి. పటిష్ఠ భద్రత నడుమ వాటిని భద్రపరిచారు. ఉత్తీర్ణత పెంపునకు చర్యలు, గత సంవత్సరం కంటే ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో విద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గత నాలుగు నెలలుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతేడాది విద్యార్థులు సైన్స్, మ్యాథ్స్, ఆంగ్లం సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు సాధించారు. ఈ ఏడాది ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దారు. పరీక్ష రాసేటప్పుడు విద్యార్థులకు గాలి, వెలుతురు ఉండేలా పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



కందుకూరు మండలంలోని 4 పరీక్షా కేంద్రాలు, బాలాపూర్ మండల పరిధిలో 19, మహేశ్వరం మండల పరిధిలో 9, సరూర్‌నగర్ పరిధిలో 44 పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాం. ప్రశ్నా పత్రాలు ఆయా కేంద్రాలకు సమీపంలోని పోలీస్‌స్టేషన్లకు చేరుకున్నాయి. మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం..

– కృష్ణయ్య, మండల విద్యాధికారి

పార్టీ స్థితిగతులపై చర్చ

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలోని ఆయన నివాసంలో బీజేపీ సీనియర్ నాయకుడు బొక్క బాల్‌రెడ్డిని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. ఆయన వెంట నాయకులు, డివిజన్ అధ్యక్షులు బాబురావు, విట్టల్, కీర్తి, శ్రీను, గోనె శ్రీకాంత్ రెడ్డి, కొంగళ్ల నవీన్, అజయ్ కాంత్ రెడ్డి, వాసు, రాజ మహేశ్, పెంట రెడ్డి, రాజా రమేశ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ముగిసిన అంతర కళాశాలల పోటీలు



ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మూడు రోజులుగా కొనసాగిన అంతర కళాశాలల పోటీలు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ వెంకటరమణ, యూనివర్సిటీ అబ్జర్వర్ త్రివేణి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఉల్లాసం కలుగుతుందన్నారు. పోటీల్లో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు నరేందర్‌రెడ్డి, పీజీ డీన్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ అనిత, విజయలక్ష్మి, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా సమయాన్ని పెంచాలి

రాజేంద్రనగర్: రంజాన్ మాసంలో తాగునీటి సరఫరా సమయాన్ని పెంచాలని రాజేంద్రనగర్ డివిజన్ ఫోర్ట్ వ్యూ కాలనీవాసులు కోరారు. కాలనీలో వారు మాట్లాడుతూ.. బుధవారం మంచినీటి సరఫరా కావాల్సి ఉన్నా.. రాలేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు స్పందించి ప్రతిరోజు సమయాన్ని పెంచి నీటి సరఫరా చేయాలని కోరుతున్నామన్నారు.

ఎంఎస్‌ఎంఈ పథకాలపై అవగాహన

మలక్‌పేట: మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) బాలానగర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం దిల్‌సుఖ్‌నగర్ అవంతి డిగ్రీ, పీజీ కాలేజీలో వ్యవస్థాపకతపై అవగాహన సదస్సు (ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్)నిర్వహించారు. ఎంఎస్‌ఎంఈ డీఎఫ్ఓ, అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి మాట్లాడుతూ, కొత్త వ్యవస్థను స్థాపించే స్ఫూర్తి నింపేలా యువత భావితరాలను చైతన్యపర్చాలన్నారు. ఎంఎస్‌ఎంఈ పథకాల గురించి తెలియజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. 59 మంది ఎస్టీ విద్యార్థులు, 13 ఉపాధ్యాయులతోపాటు మొత్తం 117 మంది సదస్సుకు హాజరయ్యారు. కార్యక్రమంలో మహతి ఎంటర్‌ప్రైజ్ ప్రొప్రైటర్ బి. హరిత, స్టార్టప్ కన్సల్టెంట్ అకాడమీ ఆఫ్ స్టార్టప్ సుధీర్ శర్మ, కెనరా బ్యాంక్ ఏజీఎం సునీత్ ఝా, అవంతి విద్యాసంస్థల హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద, డైరెక్టర్ సాయిరామ్, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఏఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.